క్లుప్తంగా

గుట్టలు సరిచేశారు!



సాక్షి స్పందన

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు అధికారులు స్పందించారు... రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న గ్రావెల్ గుట్టలను సరిచేశారు. దావు బుచ్చయ్యకాలనీ గుణదల రోడ్డు పనుల్లో భాగంగా ఇటీవల రోడ్డుపై గ్రావెల్ గుట్టలు పోశారు. పనులు నత్తనడకన జరుగుతుండటంతో పాటు గుట్టల వల్ల కనీసం ద్విచక్రవాహన చోదకులు సైతం రాకపోకలు సాగించలేని దుస్థితి ఏర్పడింది. దీంతో స్థానికులు వాహన చోదకులు పడుతున్న అవస్థలను వివరిస్తూ సాక్షి సోమవారం 'నత్తనడకన రోడ్డు పనులు' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన గుట్టలు సరిచేశారు. స్పందించిన అధికారులకు స్థానికులు, వాహన చోదకులు కృతజ్ఞతలు తెలిపారు. సాధ్యమైనంత త్వరలోనే పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

వాహన చోదకులు హెల్మెట్ వినియోగించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రమాద సమయంలో హెల్మెట్ వల్ల ప్రాణాలకు రక్షణ లభిస్తుందని, కావున ప్రతి వాహన చోదకుడు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని ట్రాఫిక్ ఎస్ఐ వెంకట కుమార్ అన్నారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులో సోమవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదకుడితోపాటు సీటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న ఇరువురిని అభినందించారు. కార్యక్రమంలో సత్యనారాయణపురం ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

28న పీవీ నరసింహారావు విగ్రహ ఆవిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా సత్యనారాయణపురం బీఆర్టీఎస్ రోడ్డులో ఈనెల 28వ తేదీ సాయంత్రం 4 గంటలకు పీవీ నరసింహారావు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగువారి ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిన మహోన్నత వ్యక్తి పీవీ నరసింహారావు అని ఆయన విగ్రహ ఆవిష్కరణకు పీవీ అభిమానులు తరలి రావాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ సెక్షన్ 11 కె.వి గులాబీ తోట ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీరు పి.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గులాబీ తోట, సాంబమూర్తి రోడ్డు, పున్నయ్య కాలనీ, పసుపులేటి వారి స్ట్రీట్, బాలాజీ స్ట్రీట్, బీఆర్టీఎస్ రోడ్డు, భానునగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

మలేరియా సబ్‌యూనిట్ కార్యాలయం ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల మరమ్మతులు చేసిన చుట్టుగుంట మలేరియా సబ్ యూనిట్ కార్యాలయాన్ని సోమవారం 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం, వార్డు సచివాలయం భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో అధికారులతో మాట్లాడి రూ.10లక్షలతో మరమ్మతులు చేయించామన్నారు. మలేరియా విభాగం సిబ్బంది మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఇక్కడ ఎవరికి ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తోట పాండు, కారంపూడి సత్య తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరస్వామికి అభిషేక అర్చనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదత్త సాయి శివకామేశ్వరీ పీఠంలో సోమవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన మాస శివరాత్రి పురస్కరించుకుని నీలకంఠేశ్వర స్వామివారికి విశేషంగా అభిషేక అర్చనలు జరిగాయి. స్వామివారికి ప్రీతికరమైన సోమవారం మాస శివరాత్రి కలసి రావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

'చెత్త'శుద్ధి పూజ్యం–ప్రమాదంలో పేదల ఆరోగ్యం

- అపరిశుభ్రతకు నెలవుగా 60వ డివిజన్
- నివాసాల మధ్య నెలల తరబడి పేరుకుపోయిన చెత్త, మురుగు
- జ్వరాలు, దుర్వాసనలతో అల్లాడుతున్నామని ప్రజల గగ్గోలు
- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ''నెలల తరబడి కాలువల్లో కదలని మురుగు...భరించలేని దుర్వాసనలతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం... జ్వరాలు, రోగాలతో అల్లాడుతున్నాము... మమ్మల్ని రక్షించండి మహాప్రభో'' అని వాంబే కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. స్థానిక 60వ డివిజన్ పరిధిలోని వాంబే కాలనీలోని ఏబీసీడీఈఎఫ్ బ్లాకుల్లోని ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులివి.

పేదల ప్రాణాలంటే అలుసా..?

స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో ప్రభుత్వం పేద ప్రజలకు జీ ప్లస్ త్రీ అపార్ట్‌మెంట్‌లు, వ్యక్తిగత ఇళ్లను కట్టించి ఇచ్చింది. నిరుపేద, సామాన్య ప్రజలు అత్యధికంగా నివసిస్తున్న ఈ ప్రాంత అభివృద్ధిపై అధికార యంత్రాంగానికి ఎప్పుడూ చిన్నచూపే. తమ నివాసాల వద్ద కనీసం వారానికోసారి అయినా చెత్త తీయడం లేదని, ఇక కాలువల పరిస్థితి అయితే మరింత దారుణంగా ఉందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు వస్తున్నప్పుడో.. ఎమ్మెల్యే పర్యటనలు ఉన్నప్పుడో తప్ప నెలలు గడుస్తున్నా కాలువల్లో మురుగును తొలగించే నాథుడే ఉండడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

జ్వరాలు, రోగాలతో అతలాకుతలం

చుట్టూ చెత్తకుప్పలు, పేరుకుపోయిన మురుగు నిల్వల నుంచి వస్తున్న దుర్వాసనలతో అసలు ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని, ఈగలు, దోమలు విపరీతంగా పెరిగిపోయి, వాటి వల్ల పసికందులు తరచూ జ్వరాలు, రోగాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇళ్ల ముందు మురుగు తీయమని, చెత్త తొలగించమని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాంబే కాలనీలోని ఎ, బి, సి, డి, ఈ, ఎఫ్ బ్లాకుల్లో పారిశుద్ధ్య సమస్యలు ఇదే విధంగా ఉన్నాయని, సిబ్బంది ఒకవేళ వస్తే తూతూమంత్రంగా పైపైన పనులు చేసి వెళ్తున్నారే తప్ప సరైన చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.



ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్త

పత్తా ఉండని శానిటరీ ఇన్‌స్పెక్టర్

వాంబే కాలనీలో చెత్త సమస్యలపై సంబంధిత సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా తమ గోడును ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది చుట్టుపక్కల అరుగుల మీద, ఇళ్ల ముందు కూర్చుని కాలక్షేపం చేసి వెళ్లిపోతారే తప్ప చెత్త, మురుగు తొలగించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని శానిటరీ మేస్త్రీలకు చెప్పినా మామూళ్ల మత్తులో వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు చెబుదామని వెళ్తే ఆయన అసలు ఆఫీస్‌లోనే ఉండరని, కనీసం ఫోన్లు చేస్తున్నా ఎత్తరని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తమ కాలనీపై ప్రత్యేక దృష్టి పెట్టి పారిశుద్ధ్య సమస్యల నుంచి తమకు విముక్తి కలిగించాలని వారు ప్రాధేయపడుతున్నారు.



నివాసాల మధ్య సైడు కాలువల్లో దుస్థితి

తిరిగి తిరిగి కాళ్లరిగిపోయాయి



మా ఇళ్ల ముందు చెత్త తీయడం లేదు. కాలువల్లో మురుగు తొలగించడం లేదు. శానిటరీ సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం శూన్యం. శానిటరీ అధికారులకు చెబుదామని ఎన్నిసార్లు కార్యాలయానికి వెళ్లినా అక్కడ కనీసం ఎందుకొచ్చారని అడిగే నాథుడే లేడు. శానిటరీ అధికారులు, స్థానిక కార్పొరేటర్ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి కాళ్లరిగిపోతున్నాయి తప్ప మా బాధలు ఎవరూ పట్టించుకోవడం లేదు.

– షేక్ ఆశా, స్థానికురాలు

ముక్కు మూసుకుని ఉండాల్సిందే!



మాది వాంబే కాలనీ ఎ బ్లాకు. మేము నెలల తరబడి మురుగు సమస్యతో అల్లాడిపోతున్నాం. తీవ్ర దుర్వాసనలతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. చంటిపిల్లలు, చిన్నారులు తరచూ జ్వరాల బారిన పడుతున్నారని అధికారులకు చెప్పినా ఫలితం లేదు. కార్పొరేషన్ కమిషనర్ స్పందించి మా ప్రాంతాలలో పారిశుద్ధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి మాకు విముక్తి కలిగించాలని కోరుకుంటున్నాం.

– కట్టా వీరమ్మ, స్థానికురాలు

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నున్న పోలీసు స్టేషన్ సీఐ పి.కృష్ణమోహన్ అన్నారు. నవజీవన్ బాల భవన్, ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిస కారాదని, బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. మత్తుపదార్థాల వలన ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబాలు సత్సంబంధాలను కోల్పోతాయన్నారు. సరైన అవగాహన లేక అనేక మంది యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి జీవితంలో మంచిగా స్థిరపడాలని ఆకాంక్షించారు. జిల్లా ఈగల్ టీమ్ సీఐ టి.ధనుంజయ్ నాయుడు మాట్లాడుతూ డ్రగ్స్, కొకైన్, గంజాయి లాంటివి మీ చుట్టుపక్కల ఎవరైనా విక్రయించినట్లు తెలిస్తే పోలీస్, 1972 కి సమాచారం అందించాలన్నారు. నవజీవన్ బాలభవన్ ప్రతినిధి గోళ్లమూడి శేఖర్‌బాబు, కాలేజీ ప్రిన్సిపాల్ జి.సంధ్యా మాధురి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు.

న్యాయవాదులకు ఉచిత కంటిపరీక్షలు

విజయవాడలీగల్: బెజవాడ బార్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్టు బీబీఏ అధ్యక్షుడు ఎ.కె.బాషా తెలిపారు. నగరంలోని ప్రముఖ కంటి ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు బీబీఏ న్యాయవాదులు, వారి కుటుంబసభ్యులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా విజ్ఞప్తిచేశారు.

వీఎంసీ పీజీఆర్‌లో 16 ఫిర్యాదులు

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను వేగంగా, సమర్థంగా పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు, పరిష్కార కార్యక్రమంలో పలువురు నగరవాసుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారం చూపడంపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో మొత్తం 16 ఫిర్యాదులు రాగా అందులో పట్టణ ప్రణాళికపై 2, ఇంజినీరింగ్‌కు సంబంధించి 8 , రెవెన్యూ 3, వైద్య, ఆరోగ్యం 1, హార్టికల్చర్ 1, ఎస్టేట్ 1 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్

శిక్షణ, అవగాహనతోనే రోడ్డుప్రమాదాల నివారణ


విజయవాడస్పోర్ట్స్: వాహన చోదకులకు అత్యుత్తమమైన శిక్షణ ఇచ్చి, అవగాహన కల్పించడంతోనే రోడ్డు ప్రమాదాలను నివారించడం సాధ్యపడుతుందని ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ సౌత్ జోన్ ఉపాధ్యక్షుడు యలమంచిలి వీరఈశ్వర రావు అన్నారు. సమభావన మిత్రమండలి 108వ సమావేశం నగరంలోని బెంజిసర్కిల్ సమీపంలోని గోరా నాస్తిక కేంద్రంలో సోమవారం జరిగింది. రోడ్డు ప్రమాదాలు–నివారణ అనే అంశంపై జరిగిన ఈ సమావేశంలో ఈశ్వరరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రోడ్డుప్రమాదాలు ఈ ఏడాది నాలుగు లక్షలు దాటడం ఆందోళన కలిగించే విషయమన్నారు. గత ఏడాది జరిగిన ప్రమాదాల్లో 1.68 లక్షల మంది మృతిచెందారని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్‌లకు ఉత్తమమైన శిక్షణ ఇవ్వాలని, ప్రమాదాలపై వాహన చోదకులకు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి వజీర్ మాట్లాడుతూ రోడ్డుపై వాహనం నడిపే వారు సాంకేతికత, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. వాహనాల అతివేగాన్ని తగ్గించాలన్నారు. అనంతరం ఈశ్వరరావు, వజీర్‌లను సమభావన మిత్రమండలి ప్రతినిధులు దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం, మిత్రమండలి గౌరవ అధ్యక్షుడు టి.శోభనాద్రి, ఉపాధ్యక్షుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.



ఈశ్వరరావు, వజీర్‌లను సన్మానించిన సమభావన మిత్రమండలి ప్రతినిధులు

సాంస్కృతిక, కళారంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలి


విజయవాడ కల్చరల్: వాసవీ సేవా సంస్థలు సామాజిక సేవతో పాటు సాంస్కృతిక కళారంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆ దిశగా కార్యాచరణ చేయాలని వాసవీ సేవా సంస్థల అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. వాసవీ క్లబ్ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సభ్యుల సమాలోచన కార్యక్రమం ఉదయాస్తమాన సేవలు 48 గంటలపాటు నిర్వహించిన నిర్విరామ సేవలు సోమవారం ముగిశాయి. గాంధీనగర్‌లో జరిగిన సమావేశానికి గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని 35 శాఖల ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయా జిల్లాల్లోని అన్ని ప్రధాన నగరాలలోనూ, గ్రామీణ ప్రాంతాలలోనూ తాగునీరు, వైద్య సేవలను అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సిమెంట్ బెంచీలు నిర్మాణం చేశామని, పేద కళాకారులకు నెల వారీ నిత్యావసర వస్తువులను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వేముల హజరత్తయ్య గుప్తాను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సమీక్ష సమావేశంలో వాసవీ క్లబ్ కీలక నిర్వాహకులు మాజేటి హరిప్రసాద్, దర్శి శ్రీనివాసరావు, ముదుపల్లి భాస్కర్, కొత్తమాసు విశ్వనాథం, కె.సుజాత లక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు. పేద కళాకారులకు నిత్యావసరాలను అందించారు.



హజరత్తయ్య గుప్తాను సత్కరిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ఎనర్జీ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్, జూనియర్ లైన్‌మన్ గ్రేడ్- 2ల ప్రతిపాదిత బదిలీలు, క్రమబద్ధీకరణలో న్యాయం చేయాలని కోరుతూ యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు సోమవారం జాయింట్ కలెక్టర్ ఇలక్కియను కలసి వినతిపత్రం అందజేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్‌లకు ప్రత్యేకమైన పని విధానం, 24 గంటలూ అందుబాటులో ఉండి అత్యవసర పరిస్థితుల్లో విధి నిర్వహణ, ప్రమాదకర పరిస్థితులు సచివాలయాల్లో పనిచేస్తున్న ఇతర సిబ్బందికి భిన్నమైన విధులు నిర్వర్తిస్తున్నారని రీజినల్ అధ్యక్షుడు ఎల్.రాజు, రీజనల్ కార్యదర్శి కనక లింగేశ్వరరావు తెలిపారు. ఎనర్జీ అసిస్టెంట్‌లు. జిల్లా అధికారులు జరగబోయే బదిలీలు, క్రమబద్ధీకరణ ఉత్తర్వుల అమలులో గ్రామ/వార్డు సచివాలయాల జనాభా నిష్పత్తితో పాటు విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, గ్రామాల మధ్య విస్తరించిన కరెంటు లైన్లు, గ్రామాల మధ్య దూరం లాంటి వాస్తవ పరిస్థితులను ప్రామాణికంగా తీసుకొని ఎనర్జీ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని కోరారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

రిటైనింగ్ వాల్ కరకట్ట అభివృద్ధికి కృషి

ఎంపీ కేశినేని శివనాథ్

కృష్ణలంక(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని, అందులో భాగంగా కృష్ణలంక ప్రాంతంలోని ప్రజలు హైవే దాటేందుకు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తున్నానని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాల్లో సోమవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశాలతో కలిసి ఆయన పర్యటించారు. నేతాజీ వంతెన వద్ద, సత్యంగారి హోటల్ కూడలి, అమెరికన్ హాస్పటల్ వద్ద హైవేను దాటేందుకు ప్రజల పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఎన్‌హెచ్ఏఐ, ఇరిగేషన్, వీఎంసీ అధికారులతో మాట్లాడి చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ జాతీయ రహదారి దాటేందుకు కృష్ణలంక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. త్వరలోనే రాణిగారితోట, అమెరికన్ హాస్పిటల్ ప్రాంతాల్లో వెహికల్ అండర్ పాస్ నిర్మిస్తామన్నారు. 21వ డివిజన్‌లో పద్మావతి ఘాట్ నుంచి రామలింగేశ్వరనగర్ వరకు కరకట్టపై వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేస్తామన్నారు. సత్యంగారి హోటల్ వద్ద యాక్సిడెంట్లను నివారించేందుకు సిగ్నల్ లైట్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ పీడీ విద్యాసాగర్, ఎన్‌హెచ్ విజయవాడ ఈఈ సంజీవ్ రాయుడు, ఇరిగేషన్ డిపార్టుమెంట్ ఎస్ఈ మోహన్‌రావు, ఈఈ రవికిరణ్, డీఈ గోపీనాథ్, వీఎంసీ సీసీపీ సంజయ్, అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగిస్తే అడ్డుకోండి

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగిస్తే అడ్డుకోండని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. సోమవారం 62 డివిజన్ భగీరథ కాలనీ పాయకాపురం పోలీస్ స్టేషన్ వెనుక భాగం ప్రాంతంలో బాబూరావు ఇంటింటికీ తిరుగుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల వలన ప్రజలకు జరిగే నష్టాన్ని వివరించారు. అనంతరం సర్దుబాటు చార్జీల పేరిట పెంచుతున్న కరెంటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించొద్దని కోరుతూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయం తీసుకోకుండా కుంటి సాకులు చెప్పి విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడం సరైంది కాదని తెలిపారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత వందల్లో ఉన్న బిల్లులు వేల రూపాయలు వస్తున్నాయని ప్రజలపై భారాలు వేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇంటింటికీ స్మార్ట్ మీటర్లు వద్దని అభ్యంతర పత్రాలు ఇచ్చారు. జూలై 4వ తేదీన రమేష్ హాస్పిటల్ సమీపంలోని కరెంట్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెంట్రల్ సిటీ సీపీఎం కార్యదర్శి బి.రమణ రావు, నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.దుర్గారావు, నగర కమిటీ సభ్యులు సీహెచ్ శ్రీనివాస్, ఎస్‌కే పీరుసాహెబ్, 62వ డివిజన్ సీపీఎం కార్యదర్శి జిల్లా నాగరాజు పాల్గొన్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుల నిర్వహణకు బ్లూ ప్లానెట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుల నిర్వహణను తమ సంస్థ దక్కించుకుందని బ్లూ ప్లానెట్ జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ డైరెక్టర్ ఇలంగోవన్ తంగవేలు కుగలూర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.62.4 కోట్ల లెగసీ వేస్ట్ ప్రాజెక్టులను దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది అక్టోబర్ రెండో తేదీ నాటికి నాలుగు ప్రధాన క్లస్టర్లలో 9.2 లక్షల టన్నులకు పైగా లెగసీ వేస్ట్‌లను తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టుల శ్రేణిలో ఆంధ్రప్రదేశ్ అంతటా లెగసి వేస్ట్, బయో-రెమిడియేషన్, బయో-మైనింగ్ భూ పునరుద్ధరణ ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు.

నేడు వీఎంసీ కౌన్సిల్ సమావేశం

- 148 అంశాలతో కౌన్సిల్‌కు ప్రతిపాదనలు
- 19 అంశాలపై ప్రశ్నోత్తరాలు
- ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ఏర్పాటైన వీఎంసీ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుంది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభం కానుంది. అజెండాలో మొత్తం 148 అంశాలపై చర్చించి తీర్మానించనున్నారు.

ప్రధానాంశాలు :

- వీఎంసీ సర్కిల్–3 పరిధిలోని 11వ డివిజన్‌లో ఉన్న ఏపీఐఐసీ కాలనీ జమాక్(జవహర్ ఆటోనగర్ మ్యూచ్యువల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ స్టోర్స్) గృహ సముదాయాలకు తాగునీటి సరఫరాపై అసోసియేషన్ సభ్యుల విన్నపం మేరకు వచ్చిన అంశం
- నగరంలోని రింగ్‌రోడ్డు వద్ద ఉన్న నూతన ప్రభుత్వాసుపత్రిలో వీఎంసీ ఆధ్వర్యంలో ఫుడ్‌స్ట్రీట్ ఏర్పాటుకు రూ.1.95 కోట్ల ఖర్చును వీఎంసీ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదన.
- సర్కిల్–1 పరిధిలోని 37వ డివిజన్ వినాయక్ టెంపుల్ నుంచి బ్రిడ్జి పంప్ హౌస్ వరకు ఉన్న 900 మిల్లీమీటర్ల ప్రీస్ట్రెస్డ్ కాంక్రీట్ మెయిన్ పైపు లైను మార్చేందుకు అయ్యే ఖర్చు రూ.96.31 లక్షలు వీఎంసీ సాధారణ నిధుల నుంచి మంజూరుకు ప్రతిపాదన.
- నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు, ఇరుకైన రోడ్లతో వస్వే ట్రాఫిక్ నియంత్రించాలంటే కేరళ రాష్ట్రంలో మాదిరి నాలుగు మల్టీస్టోరెడ్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆడపిల్ల జన్మిస్తే కర్ణాటకలో ఆ రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ్ పథకం ద్వారా రూ.50వేలు ఇస్తున్నట్లుగా, అలాంటి పథకాన్నే నగరంలో కూడా ప్రవేశ పెట్టాలని డెప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి చేసిన ప్రతిపాదన.
- నిత్యం రద్దీగా ఉండే భవానీపురం చర్చి సెంటర్‌లో, స్వాతి రోడ్డులో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి కార్పొరేటర్ బాపటి కోటిరెడ్డి చేసిన ప్రతిపాదన.

28న తెనాలిలో మానవ హక్కుల పరిరక్షణ సదస్సు

ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెనాలి పోలీసులు దళిత, మైనార్టీ యువకులపై చేసిన అరాచకత్వాన్ని, మానవ హక్కుల ఉల్లంఘనను నిరసిస్తూ తెనాలి పట్టణంలో జూన్ 28న సాయంత్రం 4 గంటలకు మానవ హక్కుల పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు తెలిపారు. విజయవాడ గాంధీనగర్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సోమవారం పరిరక్షణ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పేరుపోగు వెంకటేశ్వర రావు మాదిగ మాట్లాడుతూ తెనాలి పోలీసులు దళిత మైనారిటీ యువకులపై అక్రమ కేసులు పెట్టి పోలీస్ స్టేషన్లో, బహిరంగ ప్రదేశాల్లో అరికాళ్లపై లాఠీలు విరిగేటట్లుగా అమానుషంగా దాడి చేసిన సంఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన సీఐ రాముల నాయక్, తెనాలి త్రీ టౌన్ సీఐ రమేష్ బాబులతో పాటు కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. దళిత యువకులపై నడిరోడ్డుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని సమర్థించి వత్తాసు పలికిన గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తెనాలిలో మానవ హక్కుల పరిరక్షణ సదస్సుకు ఎమ్మార్పీఎస్, మాలమహానాడు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి, దళిత బహుజన ఫ్రంట్, ప్రజాస్వామిక వాదులు పాల్గొని విజయవంతం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాల మహానాడు అధ్యక్షుడు తుమ్మల ఫ్రాన్సిస్, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, డీబీఎఫ్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, రెల్లి సంఘం అధ్యక్షుడు ఎర్రంశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.



తెనాలి హక్కుల పరిరరక్షణ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించిన ప్రజా సంఘాల నాయకులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు అండగా ఉంటాం

ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు అండగా ఉంటామని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ ప్రకటించింది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 40 రోజులకు పైగా ఆందోళన జరుగుతోంది. సోమవారం యువతపోరు నిర్వహించిన అనంతరం పార్టీ నాయకులు మున్సిపల్ వర్కర్స్ శిబిరం వద్దకు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, మొండితోక జగన్‌మోహన్‌రావు, జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజారెడ్డి, బెల్లం దుర్గ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పిట్టా మహేష్ మాట్లాడుతూ నగరపాలక సంస్థల్లో, పురపాలక సంఘాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు టెక్నికల్ జీతం రూ.29,200, నాన్ టెక్నికల్ వారికి రూ. 24, 500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు, డ్రైవర్లకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులకు ఏదైతే రూ.6వేలు జీతం పెంచిందో, అదే జీతాన్ని అదే జీవో నంబర్ 36ను ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికులందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. మున్సిపల్ రంగంలోని కార్మికులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్‌చేశారు. సీనియార్టీని ప్రామాణికంగా తీసుకొని ఏడాదికి 6 శాతం ఇంక్రిమెంట్ కలుపుతూ జీతాలు చెల్లించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, కారుణ్య నియామకాల కింద మరణించిన వారి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. ప్రభుత్వం హెల్త్ కార్డులు మంజూరు చేసి సంవత్సరానికి 30 మెడికల్ లీవులు మంజూరు చేయాలని, క్యాజువల్ లీవులు, పండుగ సెలవులు, వారాంతపు సెలవులు అమలయ్యే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని, రిటైర్ అయిన కార్మికులకు గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బందికి సంఘీభావం ప్రకటిస్తున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు